# జో అచ్యుతానంద జో జో ముకుందా ||

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

రావే పరమానంద రామ గోవింద ||

నందునింటనుచేరి నయము మీరంగ చంద్రవదనలు నీకు సేవ చేయంగ

అందముగ వారింధ్ల ఆడుచుండంగా మందలకు దొంగ మా ముద్దు రంగ

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

పాల వారాశి లో పవ్వళించినావు

బాలుగా మునులక భయమిచ్చినావు

మేలుగా వసుదేవుకుదయించినావు

బాలుడై యుండి గోపాలుడైనావు

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

అట్టుగట్టిన మీగడట్టె తిన్నాడే

పట్టి కోడలు మూతిపై రాసినాడే

అట్టె తినెనవి యట్ట యడుగవిన్నాడే

గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే

మాగంటి వంశీ మోహన్ www.maganti.org maganti.org@gmail.com

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

గొల్లవారిండ్లకును గొబ్బునకు బోయి

కొల్లలుగా త్రావి కుండలను నేయి

చేల్లునామగనాండ్ర జెలగి ఈ శాయి

చిల్లితనములు సేయ జెల్లునట వోయి

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

రేపల్లె సతులెల్ల గోపంబుతోను

గోపమ్మ మీ కొడుకు మా ఇండ్లలోను

మాపు గానే వచ్చి మా మానములను

నీ పాపడే చెఱిచె - నేమందుమమ్మ!

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

ఒక యాలిని దెచ్చి - నొకని కడబెట్టి

జగడముల గలిపించి సతిపతుల బట్టి

పగలు నలు జాములును బాలుడై నట్టి

మగనాండ్ర జేపట్టి మదనుడైనట్టి !

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

అంగజునిగన్న మాయన్న ఇటురారా బంగారుగిన్నెలో పాలుపోసేరా
దొంగనీవని సతులు బొందుచున్నారా ముంగిటనాడరా మోహనాకారా

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

గోవర్ధనంబెల్ల గొడుగుగా బట్టి
కావరమున నున్న కంసుబడగొట్టి
నీవు మధురాపురము నేలజేపట్టి
ఠీవితో నేలిన దేవకీ పట్టి

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

అంగుగా తాళ్ళపాకన్నయ్య చాల శృంగార రచనగా చెప్పె నీజోల
సంగతిగా సకల సంపదల నీవేళ మంగళము తిరుపట్ల మదనగోపాల

జో అచ్యుతానంద జో జో ముకుందా ||

Keywords: jO achyutAnanda jO jO mukundA, annamayya lAli pATa – SrngAra racana, jO jO jO, lAli pATalu, laali paaTala sAhityam, laali pATalu